## క్లుప్తంగా

### పైపులైను లీకుకు మరమ్మతులు


లీకుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కురిచేడు: స్థానిక నుసుం బజారులోని ఎస్‌పీపీ పైపులైనుకు ఏర్పడిన లీకుకు సిబ్బంది గురువారం మరమ్మతులు చేశారు. సోమవారం సాక్షి దినపత్రికలో తాగునీటి లీకేజీని అరికట్టాలి అన్న శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి స్పందించిన అధికారులు గురువారం దానికి మరమ్మతులు చేసి లీకేజీని అరికట్టారు.

### పంచాయతీలకు నిధుల విడుదల

పుల్లలచెరువు: మండలంలోని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘ నిధులు విడుదలైనట్లు ఈవో ఆర్డీ శరత్‌బాబు తెలిపారు. గారపెంట రూ.90,775, ఐటీవరం రూ.5,36,512, కవలకుంట్ల రూ.1,42,530, కోమరోలు రూ.2,17,739, మల్లాపాలెం రూ.1,96,927, మానేపల్లి రూ.2,44,957, ముటుకుల రూ.2,50,033, మర్రివేముల రూ.4,10,817, నాయుడుపాలెం రూ.1,66,501, నరజాముల తండా రూ.1,23,905, పెద్ద పీఆర్‌సీ తండా రూ.1,26,424, పిడికిటివానిపల్లి రూ.1,51,597, పుల్లలచెరువు రూ.5,25,750, రాచకొండ రూ.3,13,060, శతకోడు రూ.2,77,299, సుద్దకురవ తండా రూ.80,657, యండ్రపల్లి రూ.1,28,387, చాపలమడుగు రూ.4,02,000 నిధులు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ నియమాలను అనుసరించి వాటిని ఖర్చు చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

### టీడీపీ నేత రమణారెడ్డికి అస్వస్థత


చికిత్స పొందుతున్న రమణారెడ్డి

యర్రగొండపాలెం: పోలీసుల లాఠీ గాయాలతో తెలుగు రైతు మండల ఉపాధ్యక్షుడు పోతిరెడ్డి రమణారెడ్డి అస్వస్థతకు గురయ్యాడు. ఈ మేరకు గురువారం స్థానిక ఏరియా వైద్యశాలలో చికిత్స పొందారు. మండలంలోని మురారిపల్లెలో నీటి తొలకంపై టీడీపీ వర్గీయుల మధ్య కొన్ని రోజులుగా వివాదం జరుగుతున్న విషయం తెలిసిందే. ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు గూడూరి ఎరిక్షన్‌బాబు వర్గానికి చెందిన నాయకులు టీడీపీకి మద్దతుగా నిలిచారు. గ్రామంలో వివాదం జరుగుతోందని రమణారెడ్డి ద్వారా తెలుసుకున్న ఎస్సై మంగళవారం రాత్రి అక్కడికి వెళ్లి ఆయన్నే లాఠీతో తీవ్రంగా కొట్టారు. ఆయనతో పాటు నీటి ట్యాంకర్‌లో పురుగుమందు కలిపారని సాక్ష్యం చెప్తున్న భాష్యం చెన్నారెడ్డిని సైతం పోలీసులు కొట్టి గాయపరిచారు. ఈ సంఘటనలో రమణారెడ్డి అస్వస్థతకు గురయ్యాడు. పోలీసులు తమను కొట్టారని సీఎం, డిప్యూటీ సీఎం, హోం శాఖ మంత్రి, డీఐజీ, ఎస్పీ, మార్కాపురం డీఎస్పీ, ఎస్సైలకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

### కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి

బేస్తవారిపేట: భవన నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకుడు షేక్ అన్వర్ బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ జితేంద్ర కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కంభంలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని, జీఓ నంబర్ 1241 రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అమృతరాజు, గన్నపుడి అబ్రహం, డి.తిరుపతయ్య, రమణయ్య, దేవదానం పాల్గొన్నారు.

### కొట్లాట కేసులో ముగ్గురు అరెస్టు



ముగ్గురిని అరెస్ట్ చూయిస్తున్న ఎస్సై అనీల్ కుమార్

పెద్దారవీడు: పొలం విషయంలో ఇటీవల కర్రలతో కొట్లాడుకున్న వారిలో ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై అనీల్‌కుమార్ తెలిపారు. మండలంలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామంలో ఈ నెల 15వ తేదీన పొలం విషయంలో రెండు వర్గాలు కర్రలతో కొట్లాడుకున్నాయి. ఘటనలో గాయాలైన కంచర్ల చెన్నకేశవులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్సై అనీల్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసుల బృందంగా ఏర్పడి నిందితులు చట్లమిట్ల గ్రామానికి చెందిన తిరుమలరెడ్డి సత్యనారాయణరెడ్డి, విజయనరసింహారెడ్డి, ఏర్వ అల్లూరిరెడ్డిలను బుధవారం అరెస్టు చేశారు. గురువారం మార్కాపురం కోర్టులో జడ్జి ఎదుట నిందితులను పోలీసులు హాజరుపరిచారు.

## సాగర్ ఆయకట్టులో
# ఆలస్యంగా వరినాట్లు


నాగార్జున సాగర్ ఆయకట్టులో వరినాట్లు వేస్తున్న కూలీలు


సాగర్ ప్రధాన కాలువ ఎగువ భాగం పరిధిలో పూర్తయిన వరినాట్లు

- సకాలంలో సాగర్ జలాలు విడుదల చేయక వరినాట్లు ఆలస్యం
- సాగర్ ఆయకట్టు పరిధిలో జిల్లాలో 4.35 లక్షల ఎకరాలు

త్రిపురాంతకం: నాగార్జున సాగర్ పరివాహక ప్రాంతంలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే వరినాట్లు పూర్తి కావాల్సి ఉండగా ప్రభుత్వం సకాలంలో సాగు నీరు విడుదల చేయక పోవడంతో ఆలస్యంగా వరినాట్లు వేస్తున్నారు. సాగునీరు విడుదలపై అధికారులు సకాలంలో నిర్ణయం తీసుకోవడంలో ప్రేక్షక పాత్ర పోషించారు. సాగర్ చివరి ఆయకట్టు భూములకు నీరు సరఫరా చేయాల్సి ఉంది. నాగార్జున సాగర్ పరివాహక ప్రాంతంలో ప్రకాశం జిల్లాలో సుమారు 4.35 లక్షల ఎకరాలు సాగవుతోంది. ఏటా సాగర్ డ్యామ్‌లో నీరుంటే సాగునీరు సకాలంలో విడుదల చేసేవారు. ఈ ఏడాది సాగర్ జలాశయం పూర్తిస్థాయిలో నిండి షట్టర్ల ద్వారా దిగువకు నీరు విడుదల చేసినా సాగునీరు విడుదల చేయడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. దీంతో సాగునీటి విడుదల ఆలస్యమైంది. సాగర్ జలాలు ఆలస్యంగా విడుదలవడంతో వ్యవసాయ పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దీంతో సేద్యపు పనులు ప్రారంభమై నారుమళ్లు పోసుకుని నారు పెరిగి నాట్లు వేసుకునేందుకు ఆలస్యమైందని రైతులు చెబుతున్నారు. సాగునీరు సకాలంలో విడుదల చేస్తారని రైతాంగం ఎదురు చూస్తూ పలు పర్యాయాలు పదేపదే కోరినా సాగర్ సిబ్బంది స్పందించక నీటిని విడుదల చేయలేదు. దీంతో సాగర్ జలాలు ప్రధాన కాలువలో ఉన్నా చుక్క నీటిని విడుదల చేయక పోవడం రైతాంగం సకాలంలో పైర్లు వేసుకునే పరిస్థితులు లేకుండా పోయాయి. ఇప్పుడిప్పుడే ముందుగా బోర్ల కింద నారు పోసిన రైతాంగం నాట్లు వేస్తుండగా మరికొంత మంది వరి నారును అధిక ధరలకు కొనుగోలు చేసి వరినాట్లు వేస్తున్నారు. సాగర్ కాలువ ఎగువ భాగంలో కొంత వరకు నీటి సరఫరా జరుగుతుండటంతో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సాగర్ కాలువ చివరి భూములకు ఇప్పటికీ నీటి సరఫరా జరగడం లేదు. చివరి భూములకు నీరందించేందుకు అధికారులు ప్రయత్నం చేయాల్సి ఉంది. సాగర్ చివరి ఆయకట్టుకు పూర్తి స్థాయిలో వరినాట్లు జరగాలంటే అవసరమైనంత నీటిని దిగువకు విడుదల చేయాల్సి ఉంది. అధికారులు ఇప్పటికైనా తగిన విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## బాధితులకు ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ


క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పుల్లలచెరువు: వినాయక చవితి సందర్భంగా మండలంలోని అక్కపాలెం తండాలోని వర్షాబాయ్, బ్రహ్మంనాయక్‌లపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసిన సంఘటన తెలిసిందే. బాధితులు యర్రగొండపాలెం వైద్యశాలలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ గురువారం వైద్యశాలకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, యర్రగొండపాలెం జెడ్పీటీసీ విజయభాస్కర్, పార్టీ మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డి, నాయకులు రోసిరెడ్డి, చెన్నయ్య పాల్గొన్నారు.

## రక్తహీనతపై అవగాహన ఉండాలి


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం

త్రిపురాంతకం: రక్త హీనతపై అవగాహన కలిగి ఉండి, రక్తం తక్కువగా ఉన్న పిల్లలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హైమావతి, జడ్పీ ప్రధానోపాధ్యాయుడు ఏ శ్రీనివాసరావు పేర్కొన్నారు. త్రిపురాంతకం జడ్పీ హైస్కూల్‌లో కిషోర్ బాలికలకు హెచ్‌బి రక్తపరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు రక్తహీనతలేకుండా ఆకుకూరలు, గుడ్లు, పాలు, చిరుధాన్యాలు తినాలన్నారు. మనకు అందుబాటులో ఉండే రాగులు, సజ్జలు, జొన్నలు వంటివి ఆహారంగా తీసుకుంటు పాఠశాలలో ఇచ్చే గుడ్లు, రాగిజావ ఆహారంగా తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా ర్యాలి నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా క్రీడా పోటీలు


వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు


ఆటల పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు


పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈఓ

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19, 20వ తేదీల్లో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్రీడా పోటీలను ఎంఈఓ మస్తాన్‌నాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మస్తాన్‌నాయక్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రవేశ పెట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చాలని క్రీడాకారులకు సూచించారు. గెలుపోటములు సర్వసాధారణమని, ఓటమి గెలుపునకు తొలిమెట్టు అని, ఓడినంత మాత్రాన నిరుత్సాహానికి గురికాకుండా పోటీల్లో పాల్గొనాలన్నారు. పోటీల్లో మండలానికి చెందిన రామచంద్రకోట, బొమ్మలాపురం, వై.చర్లోపల్లి, మల్లికార్జునపురం మోడల్ స్కూల్, ఐనముక్కల బాలికల గురుకుల పాఠశాల తిమ్మాపురం ఏకలవ్య మోడల్ పాఠశాల, కస్తూరిబా గురుకుల పాఠశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలు ప్రదర్శించి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ, వాలీబాల్, యోగా, షటిల్ బాడ్మింటన్, చదరంగం, ఖోఖో పోటీల్లో అండర్-14, అండర్-17 విభాగాల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. పోటీల్లో ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు రామానాయక్, రోహిణి, సిద్ధు, సరస్వతి బాయి, ప్రీతి పాల్గొని మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

### క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

ముండ్లమూరు (దర్శి): విద్యార్థులకు ఆటల పోటీలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎంఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక హైస్కూల్లో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో లాంగ్ జంప్, హైజంప్, యోగా, పరుగుపందెం, జావలిన్‌త్రో నిర్వహించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసపత్రం అందజేస్తామని పేర్కొన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన వారు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ చొక్కా శేషయ్య, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### గిరిజన గూడెంలో వైద్య శిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని తుమ్మలబైలులో చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్ యాగ్నిక్ జ్వరాలతో బాధపడుతున్న పలువురుకి వైద్య పరీక్షలు చేశారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే సేవించాలని వారికి సూచించారు. సూపర్‌వైజర్ సత్యనారాయణరెడ్డి, పద్మావతి, భరత్ భూషణ్, నాగలక్ష్మి, సుబ్బాయమ్మ పాల్గొన్నారు.

### హౌస్ టూ హౌస్ ఫీవర్ సర్వే


మురుగు కాలువను పరిశీలిస్తున్న అధికారులు

దర్శి: మండలంలోని తూర్పు వీరాయపాలెంలో గురువారం హౌస్ టూ హౌస్ ఫీవర్ సర్వే జరిగింది. చందలూరు పీహెచ్‌సీ హెల్త్ అధికారి సీహెచ్ దయామని ఆధ్వర్యంలో గ్రామంలో ప్రజలకు జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రజారోగ్య సంక్షేమం గురించి వివరించారు. ల్యాబ్‌టెక్నీషియన్ వసంతకుమార్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్, హెల్త్ అధికారి హర్షిణి, ఏఎన్ఎంఅలేఖ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### జెడ్పీలో ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలు

దొనకొండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14, 17 సంవత్సరాల్లోపు బాల బాలికలకు ఈ నెల 20, 21వ తేదఅఈల్లో ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు కాలే నరసింహారావు తెలిపారు. 20వ తేదీన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాట్మింటన్, 21న అథ్లెటిక్, యోగా, చెస్ పోటీలు జరుగుతాయన్నారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు దర్శి నియోజకవర్గ స్థాయిలో పాల్గొంటారు. పోటీల్లో ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న బాల బాలికలు అండర్-14 విభాగంలో 2011 జనవరి 1 తర్వాత, అండర్-17 విభాగంలో 2008 జనవరి 1 తర్వాత జన్మించిన వారు పాల్గొన వచ్చన్నారు. పోటీల్లో పాల్గొనే వారు జనన ధ్రువీకరణ పత్రం ప్రధానోపాధ్యాయుడు అటెస్ట్ చేసిన పత్రాలు తీసుకొచ్చి క్రీడల్లో పాల్గొనాలని నరసింహారావు కోరారు.

## పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు

- విధులకు దూరంగా ప్రభుత్వ వైద్యులు
- గ్రామీణ వైద్యశాలల్లో నిలిచిన వైద్యసేవలు
- ఇబ్బందులు పడుతున్న రోగులు


పుల్లలచెరువు పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

పుల్లలచెరువు: పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోటా సీట్లలో కోత విధించడాన్ని నిరసిస్తూ ప్రభుత్వ వైద్యులు ఆందోళన బాటపట్టారు. దీంతో మండలంలో ఉన్న పుల్లలచెరువు, ముటుకుల ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యసేవలు నిలిచిపోయాయి. దీంతో రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అనారోగ్యం బారిన పడి ఉన్నారు. దీనికి తోడు డెంగ్యీ, మలేరియా వంటి వ్యాధులు విజృంభిస్తున్నాయి. వ్యాధులు ముసురుతున్న సమయంలో వైద్య సేవలు నిలిచిపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని రోగులు విలవిల్లాడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వైద్యశాలలకు వచ్చే రోగులు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. దీనిపై డాక్టర్ లక్ష్మీనరసింహ మాట్లాడుతూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు విధులు బహిష్కరిస్తున్నామన్నారు. ఇన్ సర్వీస్ కోటలో సీట్ల సంఖ్య తగ్గింపును వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైద్యులు ఆందోళన దిగారన్నారు. జీవో 85ను తక్షణమే రద్దు చేయడంతో పాటు తమ డిమాండ్‌లను ప్రభుత్వం నెరవేర్చాలని ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల అసోసియేషన్ డిమాండ్ చేస్తోందన్నారు. వైద్యుల సర్వీసు ఆధారంగా పదోన్నతులు ఇవ్వాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి 30 శాతం అదనంగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## స్పీడు బ్రేకర్లు వేసి..హెచ్చరిక బోర్డులు మరిచారు!


హెచ్చరిక బోర్డులు లేని స్పీడు బ్రేకర్లు

కురిచేడు: స్థానిక వినుకొండ రోడ్డులోని ఎన్‌ఎస్‌పీ కాలనీ వద్ద వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంబేద్కర్ గురుకుల పాఠశాల వద్ద రోడ్డుపై స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు. వాటిని గుర్తించే విధంగా వాటిపై రంగులు వేయటం కానీ, హెచ్చరిక బోర్డులు పెట్టడం కానీ చేయక పోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సిమెంట్ కాంక్రీటుతో స్పీడు బ్రేకర్లు వేయటంతో అవి దగ్గరకు వచ్చే వరకు కనిపించడం లేదు. దీంతో స్పీడుగా వచ్చిన ద్విచక్ర వాహనదారులు స్పీడు బ్రేకర్లు ఎక్కి కిందపడిపోయి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

## బోర్లను పరిశీలించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు


డీప్ బోర్లను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలో భూగర్భ జలాలు ఎండిపోయి కొన్నిచోట్ల మోటార్లు మరమ్మతులకు గురై నీటి కొరత ఏర్పడిన నేపథ్యంలో యర్రగొండపాలెం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నవకిశోర్, ఏఈ భ్రమరాంబికాదేవి, పంచాయతీ కార్యదర్శి మోహన్‌రావులు మండల కేంద్రంలోని ఎస్సీ పాలెంలోని 3 మోటార్లు, బోర్లను పరిశీలించారు. భూగర్భ జలాలు ఎండిపోవడంతో నూతనంగా ఎన్ని పైపులు వేసినా నీరు తక్కువగా వస్తుండటంతో స్థానికులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నవకి కిశోర్ మరమ్మతులు చేయించి నీరు అందించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. అదే విధంగా ఫారెస్టు గెస్టు హౌస్‌కు వెళ్లే దారిలో రెండు బోర్లను సైతం పరిశీలించారు. నూతనంగా ఎస్సీ మాలపాలెంలో వేసిన బోరును పరిశీలించి అదనంగా పైపులను వేయించి కొత్త మేర నీటి కొరత తగ్గుతుందని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతూ నీటి కొరత ఏర్పడిన ప్రదేశాల్లో ప్రస్తుతం నీటి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది రంగస్వామి, పందిటి కిరణ్‌ను ఈ సందర్భంగా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది శేషిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి


రైతులతో మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: వ్యవసాయంలో భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి తెలిపారు. మండలంలో బద్వీడుచెర్లోపల్లి, సానికవరం, మద్దలకట్ట గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను సందర్శించడంతో పాటు ఈకేవైసీని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగులో విచక్షణ రహితంగా ఎరువులు వాడితే ఖర్చులు పెరుగుతాయని చెప్పారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎంత మోతాదులో ఎరువులు వాడాలో అంతే వాడాలని, కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా వాడకూడదన్నారు. సాగులో సమస్యలు, అధిక దిగుబడి సాధించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. సాగు చేసిన పంటలు నమోదు చేయించుకున్న ప్రతి రైతు ఈకేవైసీ తప్పనిసరిగా రైతు సేవా కేంద్రంలో ఉన్న వీఏఏల వద్ద వేయాలన్నారు. వీఏఏలు శ్రీకాంత్, శిరీష, లాలరవి, రైతులు పాల్గొన్నారు.

### సమాచార హక్కు చట్టంపై అవగాహన

పెద్దదోర్నాల: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై శుక్రవారం అవగాహన కల్పించనున్నట్లు వ్యవసాయశాఖ అధికారి జవహర్ లాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే అవగాహన కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

## శంకరాపురంలో స్వచ్ఛతా హీ సేవా


శంకరాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని శంకరాపురంలో గురువారం జనశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో పరిసరాలను శుభ్రం చేయించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని జనశిక్షణా సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ కె.శామ్‌సునీల్ తెలిపారు. ప్రతి ఒక్కరూ జన్మభూమి భారత్‌కి సేవ చేయడం అవసరమన్నారు. తొలుత హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు. డీబీఆర్‌సి జిల్లా కార్యదర్శి దార్ల కోటేశ్వరరావు, జనశిక్షణ సంస్థ సంచాలకులు పి.శ్రీనివాసరావు, శిక్షకురాలు ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్త మెర్సీగ్రేస్, మహిళలు పాల్గొన్నారు.

## ఆకు కూరల్లో బలమైన పౌష్టికాహారం


రుద్రసముద్రంలో పౌష్టికాహార ర్యాలీ

దొనకొండ: గర్భిణులు, బాలింతలు ఆకు కూరలు వాడితే వాటిలో తగినంత పోషకాలు మరియు విటమిన్స్ ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి తెలిపారు. మండలంలోని రుద్రసముద్రం అంగన్‌వాడీ 1, 2 కేంద్రాల్లో గురువారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు రోజూ ఆకు కూరలు, చిరు ధాన్యాలు, గుడ్లు, పాలు క్రమం తప్పకుండా తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు స్వప్న, లలిత, ఆశాలు పాల్గొన్నారు.